క్లుప్తంగా

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

వేలేరు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 6,7,8వ తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి జులై 2న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాతు అజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జులై 1 సాయంత్రం 5 గంటల్లోపు గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. జులై 2 ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఆత్మకూరు : ప్రైవేటు స్కూళ్లలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం తెచ్చిన జీఓ 91 ఎక్కడ అమలు కావడం లేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కూడా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై విద్యా కమిషన్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మచ్చిక సురేష్, అజయ్, ఎల్లమ్మ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల మైదానం ఆక్రమణ



దామెర : ప్రభుత్వ పాఠశాల మైదానం ఆక్రమణకు గురైన సంఘటన మండలంలోని ల్యాదెల్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానానికి ఆనుకుని గ్రామానికి చెందిన కలువాల రాజేశ్వర్‌రావుకు వ్యవసాయ భూమి ఉంది. కాగా సమీపంలోని పాఠశాలకు చెందిన భూమిని కొంతమేర రాజేశ్వర్‌రావు ఆక్రమించి తన భూమితో కలుపుకుని సాగుచేస్తున్నాడు. ఆక్రమిత భూమిలో ప్రభుత్వ ఖర్చులతో ఏర్పాటు చేసిన చేతిపంపు కూడా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయమై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి పాఠశాల మైదానాన్ని కాపాడాలని కోరుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావును వివరణ కోరగా పాఠశాల స్థలాన్ని ఆక్రమించింది నిజమేనని, ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

బాధిత కుటుంబానికి 'సిరికొండ' పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మామిడి త్రిశూల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శనివారం త్రిశూల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మహేందర్, రవీందర్, రమేశ్, సారయ్య, గణేశ్, తరుణ్‌గోపి, మనికేష్ తదితరులు ఉన్నారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం



మండలంలోని మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ సోదరుడు ఆర్మీ జవాన్ అరికిల్ల ప్రవీణ్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి శనివారం ప్రవీణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట నాయకులు రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, సుమన్, సాంబరెడ్డి, రాజేందర్, సంతోష్, శివకృష్ణ, సుమన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పంట బీమా అమలు చేయాలి

నడికూడ : ప్రభుత్వం పంట బీమాను వెంటనే అమలు చేయాలని రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు శనివారం ప్రకటనలో కోరారు. పంటనష్టపోయిన రైతులకు అండగా నిలిచే బీమాను పథకాన్ని అమలు చేయకపోవడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో!

- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- కనిపించని కంచెలు
- బలవుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



షోడాషపల్లి నుంచి వేలేరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో, ప్రధాన రహదారులకిరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి చుట్టూ రక్షణగా కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోడ్లకిరువైపులా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులు.. కంచెలు ఏర్పాటు చేయడం మరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు తగిలి విద్యుత్ షాక్‌తో మూగజీవాలు మృతిచెందిన ఘటనలు ఉన్నాయని, కానీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే ప్రధాన రహదారులకిరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దురదృష్టవశాత్తు వాహనాలు అదుపుతప్పి ఢీ కొడితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షాలు కురుస్తున్నప్పుడు అటుగా ఎవరైన వెళితే ఎర్త్ వైర్లు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని, అధికారులు పట్టించుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.



కన్నారం - ఇచ్చుళ్లపల్లికి వెళ్లే రోడ్డులో రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తక్కువ ఎత్తులో ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

మండలంలోని షోడాషపల్లి ప్రధాన రహదారికిరువైపులా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకుండా చేతికి అందే ఎత్తులోనే ఉంది. అలాగే కన్నారం నుంచి ఇచ్చుళ్లపల్లికి వెళ్లే దారిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు చేతికందే విధంగా ఉన్నాయి. ఆ దారి గుండా నిత్యం పశువులు, మేకలు, గొర్రెలు మేత కోసం వెళ్తుంటాయని, పశువులకు ట్రాన్స్‌ఫార్మర్ తాకే విధంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీచర క్రాస్ రోడ్డు నుంచి వేలేరుకు వెళ్లే దారిలో కూడా కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, వేలేరులోని గురుకుల పాఠశాలలో కంచె లేకుండా ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని పలువురు స్థానికులు అంటున్నారు. అలాగే పీచర గ్రామంలో గతంలో జల్తారి శ్రీనివాస్, మల్లారెడ్డి అనే ఇద్దరి రైతుల పాడి గేదెలు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో మృతిచెందాయని గుర్తు చేస్తున్నారు. కొన్ని చోట్ల వ్యవసాయ పొలాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండటం, విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగి ఉండటంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొందని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ప్రధాన రహదారులకిరువైపులా కంచె లేకుండా ఏర్పాటు చేశారు. కన్నారం నుంచి ఇచ్చుళ్లపల్లికి వెళ్లే రోడ్డు వెంట రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ల ఎత్తు పెంచాలి. అలాగే వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి.

\- రేణుకుంట్ల వెంకన్న, ఇచ్చుళ్లపల్లి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కమలాపూర్ : జూలై 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన హమాలీ కార్మికుల విస్తృత సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక వర్గంపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులను భవిష్యత్‌లో యమానులకు బానిసలుగా మార్చే కుట్ర పన్నుతుందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు పైబడిన హమాలీలకు నెలకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు రవీందర్, తిరుపతి, రవి, ఐలయ్య, కుమారస్వామి, ఆనందం, రాజు, అనిల్, సదానందం పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవడం సరికాదు



సమావేశమైన విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవడం సరికాదని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు అభిప్రాయపడ్డారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్ హౌస్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ (ఏఐవైఎఫ్), దుర్గం సారయ్య (పీడీఎస్‌యూ), గుగులోతు రాజునాయక్ (గిరిజన శక్తి), మేడ రంజిత్ (టీజీవీపీ), మట్టెడ కుమార్ (పరిశోధకుడు), కన్నం సునీల్ (టీఎస్ఎఫ్), దుప్పటి కిషోర్, కాడపాక రాజేందర్, బొట్ల మనోహర్ (బీఎస్ఎఫ్) మాట్లాడారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాపితంగా వివిధ చోట్ల ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉపక్రమించిందన్నారు. అందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కాగా, కాకతీయ యూనివర్సిటీ భూమిని యూనివర్సిటీ అధికారులు కేటాయించారని గుర్తుచేశారు. ఈ క్రమంలో కొన్ని విద్యార్థి సంఘాలు సొంత రాజకీయ ఎజెండాతో ఆ స్కూల్ ఏర్పాటును అడ్డుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, వివిధ సంఘాల బాధ్యులు సౌరవ్, రాహుల్, శివరెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'పీవీ' సేవలు చిరస్మరణీయం



ఎల్కతుర్తి : పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు, నాయకులు



నడికూడ : పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తునన్న ఉపాధ్యాయులు

- ఘనంగా పీవీ జయంతి

ఎల్కతుర్తి : భారతరత్న, దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతిని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో శనివారం పలు పార్టీల నాయకులు, అధికారుల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ నివాస గృహానికి చెరుకున్న అధికారులు, నాయకులు ఫొటో ఎగ్జిబీషన్‌ను పరిశీలించారు. భారతదేశం క్లిష్టపరిస్థితిలో ఉన్నప్పుడు ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టి భూ, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ సంపద సృష్టించిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. వంగర గ్రామంలో పీవీ విజ్ఞాన కేంద్రం పనులను కొనసాగిస్తున్న సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాయల చైర్మన్ లింగమూర్తి, తహసీల్దార్ రాజేష్, కాంగ్రెస్ నాయకులు అయిలయ్య, ప్రకాశ్, మధన్‌మోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, మొండయ్య, సతీష్, సుధాకర్, రమేశ్, వెంకటస్వామి, ప్రకాశ్, వివిధ పార్టీల నాయకులు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి జరుపుకొన్నారు. మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు దేవ, రాజుకుమార్, సత్యపాల్, అంగన్‌వాడీ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

'యూరియా కష్టాలు తప్పడం లేదు'

సంగెం : యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నామంటూ మండలంలోని గవిచర్ల రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట వాపోయారు. దయాకర్‌రావు గవిచర్ల మీదుగా వెళ్తుండగా అయనతో రైతులు కలిసి మాట్లాడారు. గత పదేళ్లలో లేని ఎరువుల కరువు వచ్చిందని, చెప్పులు పెట్టి లైన్‌లో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. రైతులకు ఎరువులు సరఫరా చేయలేని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం సరిపడా ఎరువులు, యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గూడ సుదర్శన్‌రెడ్డి, దొనికెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏజీపీగా శ్రీనివాస్ నియామకం



పరకాల : ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది మేరుగు శ్రీనివాస్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయ శాఖ సెక్రటరీ ఆర్.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. మూడు సంవత్సరాల పాటు మేరుగు శ్రీనివాస్ ఏజీపీగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు ఫిర్యాదు

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ సుష్మాకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ మాట్లాడుతూ.. రెండో వార్డులోని వివిధ వీధుల్లో సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో పాటు రోడ్డు కోసం కంకర పోసి సీసీ వేయకుండా వదిలేశారని ఆరోపించారు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వీధిలైట్లు వెలుగకపోవడంతో రాత్రి వేళల్లో వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ముగ్గురిపై కేసు

ఆత్మకూరు : అన్నదమ్ములపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తనుగుల రాజును శనివారం తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన బరుపట్ల రాజు, అన్వేష్, శ్రవణ్ కలిసి దాడి చేయగా రాజు తన సోదరుడు రఘుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో రఘు వచ్చి తన అన్నను ఎవరు కొట్టారని ప్రశ్నించగా అతడిపై కూడా ముగ్గురు రాడ్లతో కొట్టి గాయపర్చారని రఘు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

గీసుకొండ : వ్యవసాయ రంగంలో మార్పులను సూచిస్తూ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అనంతారంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ×రైతన్నా మేలుకో× షార్ట్ ఫిలిం ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తప్పుడు విధానాలతో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బోయపాటి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా గద్దె రామారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు సయింపు వెంకటేశ్వర్‌రావు, దండ ఆదినారాయణ, గద్దె నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, నగేశ్, రవీందర్ పాల్గొన్నారు.

డీవీకే ఆలోచనలు ఆచరణీయం



నర్సంపేట : విప్లవోద్యమానికి దుర్గంపూడి వెంకటకృష్ణ (డీవీకే) ఆలోచనలు ఆచరణీయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు తెలిపారు. డీవీకే మూడో వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. బాల్యం నుంచే అంచలంచెలుగా ఎదిగారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమాల వైపు నడిచారని తెలిపారు. కార్మిక సంఘం స్థాపించి అనేక పోరాటాలు నిర్మించారని వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు కత్తుల కొమురయ్య, సింగరబోయిన కట్టయ్య, టీయూసీఐ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, పీవైఎల్ అధ్యక్షుడు మనోహర్‌చారి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

దామెర : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ల్యాదెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగ నివారణ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. యువత వ్యసనాల బారిన పడి బంగారు భవిశ్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గుట్కా, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి బలోపేతం చేయడంతో గ్రామస్తులు సహకరించాలని అన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. వందేమాతరం రవీంద్ర, ఏఎస్సైలు రాజు, యాకయ్య, రమేశ్, ఉపాధ్యాయులు కమలాకర్, అనిల్‌కుమార్, సాంబశివరావు, శ్రీనివాస్, భద్రయ్య, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్థానిక' పోరులో కమ్యూనిస్టులను గెలిపించాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలో కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరై మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కమ్యూనిస్టులు రాజకీయంలో ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. మావోయిస్టులను కగార్ ఆపరేషన్ పేరుతో హత్యలు చేయడం సరికాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగాన్ని పూర్తి విరుద్ధమన్నారు. మావోయిస్టులు సైతం జనజీవన స్రవంతిలో కలిసి కమ్యూనిస్టులతో కలిసి రావాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఎల్కతుర్తిలో ట్రిపుల్‌ఐటీ విద్యా కేంద్రాన్ని నెలకొల్పి ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ పాటుపడాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి, నాయకులు రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, రమాదేవి, రామచంద్రారెడ్డి, తిరుమల, విజయ్, మనోహర్, లలిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

- ఎంపీడీఓ బాబు, ఎంఈఓ శ్రీధర్

కమలాపూర్ : విద్యార్థులు ఇష్టపడి చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చదువుకునే సమయంలో సదుపాయాలు లేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తున్నాయని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అంతకుముందు మోటివేషనల్ స్పీకర్, లైఫ్ స్కిల్ కోచ్ డాక్టర్ చెల్లోజు శ్రీనివాస్ లైఫ్ స్కిల్స్, విద్యార్థుల్లో వస్తున్న విపరీత పోకడలు, వాటిని ఎలా అధిగమించాలనే విషయాలను వివరించారు. సమయం విలువ తెలియజేస్తూ సమయాన్ని ఎలా వినియోగించుకోవాలో, జ్ఞాపకశక్తి ఎలా పెంపొందించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు, తల్లిదండ్రులను, పదో తరగతి, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను, క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకే 'పొలంబాట'

- విద్యుత్ శాఖ డీఈ విజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈ విజేందర్‌రెడ్డి

కమలాపూర్ : విద్యుత్ వినియోగం, రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించేందుకే పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు విద్యుత్ శాఖ డీఈ విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులు పంట పొలాల వద్ద స్టార్టర్లు, ఫ్యూజులు, స్టార్టర్ డబ్బాలు నాణ్యతగా ఉండేలా చూసుకుని భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. మండలంలోని మర్రిపల్లిగూడెంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో మాట్లాడారు. ఏమైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు, పశువులు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా, ఎక్కడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే తెలుపాలన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎస్ఎస్ 01–100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు పక్కకు మారుస్తామని హామీ ఇచ్చారు. ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ సంపత్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు సురేందర్, జంపన్న, లైన్‌మెన్ రమేశ్, ఏఎల్ఎంలు సక్రు నాయక్, శ్రీనివాస్, అన్‌మ్యాన్డ్ క్రాంతికుమార్, రైతులు అశోక్‌రెడ్డి, ఐలయ్య, రంజిత్, శంకర్, రాజేశ్, శ్రీధర్, స్వామి, రవి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కల్వల సత్యనారాయణకు శనివారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విస్తుపోయి కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారంటీలను నమ్మారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యం దోపిడి విచ్చలవిడిగా జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజకీయాలకు తావివ్వకుండా అర్హులైన పేదలకు ఇవ్వాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందడంలేదని, రాజకీయ నాయకుల జోక్యం వలన అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రభుత్వం చేయూత పింఛన్‌లు ఎక్కడ అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు మహ్మద్ ఉస్మాన్, మంద భద్రయ్య, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేలేరు : పీచర సబ్‌స్టేషన్ పరిధిలోని వేములపల్లి ఫీడర్‌లో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన టవర్లకు తీగలు అమర్చుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. వేములపల్లి ఫీడర్‌లో గల రైతులు సహకరించగలరని కోరారు.